



జీవోల ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న టీడీపీ-జనసేన నాయకులు

వాడవాడలా 'కీడు తొలగాలి.. ఏపీ వెలగాలి'

భోగి మంటల్లో జీవోల ప్రతులు వేసి టీడీపీ-జనసేన నిరసన

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్, జనవరి 14: 'కీడు తొలగాలి.. ఏపీ వెలగాలి' పేరుతో టీడీపీ-జనసేనలు వినూత్నంగా నిరసన తెలిపాయి. జిల్లా అంతటా ఆ పార్టీల శ్రేణులు చీకటి జీవోల ప్రతులను ఆదివారం భోగి మంటల్లో వేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో చేపట్టారు. ఇన్‌చార్జి అదితి గజపతిరాజు హాజరయ్యారు. కార్యకర్తలతో కలిసి భోగిలో 1, 2, 77 జీవోల ప్రతులు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ పాలనను భోగిమంటల్లో వేసేద్దామని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచార ఘటనల్లో దేశంలో రాష్ట్రం 5వ స్థానంలో ఉందని ఆరోపించారు. పాలవలస యశస్విని మాట్లాడుతూ, రాష్ట్రంలో రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనన్నారు. నాలుగున్నర ఏళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించిందని, దీనివల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అన్ని వ్యవస్థలూ నాశనమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, బొద్దల నర్సింగరావు, ప్రసాదుల ప్రసాద్, పూసపాటి రాజేష్‌వర్మ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జగనన్నా.. పండగేదన్నా

- ప్రభుత్వంపై నిరాశతో ఉద్యోగుల ఆందోళనలు
- నెలకు పైగా నిరసన బాట
- రైతుల్లోనూ ఆవేదన
- పంట వచ్చినా గిట్టుబాటు అంతంతే
- పేదలకు ఇప్పటికీ అక్కరకు రాని టిడ్కో ఇళ్లు

సంక్రాంతి పండగ వస్తోందంటే అన్ని వర్గాల ప్రజల్లోనూ ఉత్సాహం ఉరకలేస్తుంది. కుటుంబ సభ్యులంతా ఆనందంగా గడపాలనుకుంటారు. సమాజంతో పాటే ఆటపాటల్లో భాగస్వాములవ్వాలని భావిస్తారు. అయితే ఈ సంక్రాంతి అలా లేదు. చాలా మంది ఉద్యోగులు నిరాశతో ఉన్నారు. ప్రభుత్వ తీరు వల్ల ఈ ఏడాది పండగను ఆనందంగా జరుపుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు పేదలు కూడా నిరాశతో ఉన్నారు. నింగినంటిన ధరలతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు వరి పంట చేతికొచ్చినా గిట్టుబాటు కాని పరిస్థితి. కొనుగోలు నిబంధనల పేరుతో వారిని దళారులు మోసగిస్తున్నారు. పంట అమ్మినా చేతికి డబ్బులు సకాలంలో అందడం లేదు. డీఎస్సీ నోటిఫికేషన్ రాక బీఈడీ పూర్తిచేసిన వారంతా ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులదీ ఇదే వేదన.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఉద్యోగులు, పేదలు, రైతులు, నిరుద్యోగులు ఇలా అందరిదీ ఒకటే బాట అయింది. వీరెవరిలోనూ ఈ ఏడాది సంక్రాంతి శోభ కనిపించడం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్రాంతి సమయంలో కానుకల కింద నిత్యావసరాలు అందేవి. నేడు ఆ పరిస్థితి లేదు. క్రిస్మస్ కానుక, తోఫా ఇలా ఏదీ లేదు. ఉద్యోగులకు జీతాలు లేవు. నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ అందించాలని కోరుతూ ఉద్యమిస్తున్నారు. నెలకు పైగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తాము అధికారంలోకి వస్తే జీతాలు పెంచుతామని, సమాన పనికి సమాన జీతం చెల్లిస్తామని హామీ ఇచ్చిన జగన్, తర్వాత మాట తప్పారని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు కొద్దిరోజులు ఉద్యమించారు. ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందంతో తాత్కాలికంగా నిరసన ఎత్తివేశారు. అయితే కొన్నాళ్లుగా నిరసన తెలిపిన కారణంగా ఈ నెల జీతాలు ఇంకా అందలేదు.

● రైతుల పరిస్థితి మరింత ఘోరం. తాము పండించిన ధాన్యాన్ని సకాలంలో అమ్మలేక అవస్థలు పడుతున్నారు. కొనుగోళ్లలో దళారుల ప్రమేయం లేదని అధికారులు చెబుతున్నా రైతుల నుంచి దళారులే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. క్వింటా వద్ద ఆరు కిలోల ధాన్యాన్ని అదనంగా తూకం వేసి దోపిడీ చేస్తున్నారు.

● వైసీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణాల పరిస్థితి మరింత దయనీయం. ప్రధానంగా టిడ్కో ఇళ్లను ఇప్పటికీ పేదలకు అందివ్వలేదు. టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను మంజూరు చేసింది. లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణం జరుగుతున్న తరుణంలో ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ హయాంలో పూర్తి చేసిన ఇళ్లను కూడా లబ్ధిదార్లకు అందించలేదు. సారిపల్లిలో 2700, సోనియానగర్‌లో 1120, నెల్లిమర్లలో 528 ఇళ్లను మంజూరు చేశారు. చాలావరకు నిర్మాణాలు పూర్తి చేశారు కాని లబ్ధిదార్లకు అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదు.



అంగన్వాడీల నిరసన(ఫైల్)



విజయనగరం: వసంత్‌విహార్ గృహ సముదాయం వద్ద భోగి



బాడంగి: పోటీలో బండను లాగుతున్న ఎద్దు

భోగి సందడి

● జిల్లా అంతటా భోగి మంటలు ● ఆలయాల్లో గోదాదేవి కల్యాణం ● నేడు మకర సంక్రాంతి

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్/ రాజాం రూరల్:

సంక్రాంతి వచ్చింది.. సందడి తెచ్చింది.. పల్లె, పట్టణాలు కొంగొత్త శోభను సంతరించుకున్నాయి. ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. సంప్రదాయాలు తొణికిసలాడుతున్నాయి. భోగి మంటలతో పండగ ఆరంభం అదిరింది. తెలవారకముందే పల్లెలన్నీ ఎర్రటి కాంతులతో మెరిసిపోయాయి. ప్రత్యేక కళను సంతరించుకున్నాయి. పల్లెపల్లెన.. వీధివీధిన భోగి మంటలు వేస్తూ జిల్లా ప్రజలు కేరింతలు కొట్టారు. తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతిలో తొలిరోజు భోగి మంటల తంతు ఆదివారం వైభవంగా సాగింది. పిల్లలు, పెద్దలు, యువత భాగస్వాములయ్యారు. గ్రామాల్లో పిల్లలంతా భోగి పిడకలను తీసుకువెళ్లారు. ఇక పండగ అతిథులైన హరిదాసులు, బుడబుక్కలవారు, డూడూ బసవన్నలు అందరినీ ఆకట్టుకుంటున్నారు. ఇళ్ల ముందు మహిళలు తీర్చిదిద్దిన ముత్యాలముగ్గులు సంక్రాంతి ప్రాధాన్యతను చాటుతున్నాయి. మకర సంక్రాంతి రోజున మరింత విరివిగా ముంగిళ్లను రంగవల్లులతో అలంకరించనున్నారు.

● అసలు సంబరానికి వేళ అయింది. పండగ మూడురోజుల్లో కీలకమైన మకర సంక్రాంతి కూడా వచ్చేసింది. బంధువులు, కుటుంబీకులు సుదూర ప్రాంతాల నుంచి చేరుకున్న వారంతా ఆటపాటలు, పిండివంటకాల్లో మునిగితేలనున్నారు. పతంగులను ఇదేరోజు ఎగరేయడం ఆనవాయితీ. బంధుమిత్రులతో పల్లెలు కళకళాడుతున్నాయి. సంక్రాంతి రోజున పెద్దలను పూజిస్తారు. వారి పేరున పూజలయ్యాక కొత్త దుస్తులు ధరిస్తారు. మరోవైపు కోళ్లు, పొట్టేల పందేల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఇంకోవైపు మార్కెట్‌లు ఆదివారం కూడా కిటకిటలాడాయి. వస్త్ర, నగల దుకాణాలు కిక్కిరిసిపోయాయి.

గజరాయునివలసలో ఎడ్ల పోటీలు

బాడంగి/ బొబ్బిలి జనవరి 14: బాడంగి మండలం గజరాయునివలస గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఎడ్లతో బండలాగే పోటీలను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా బొబ్బిలి టీడీపీ ఇన్‌చార్జి ఆర్‌వీఎస్‌కేకె రంగారావు (బేబీనాయన), ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు హాజరై పోటీలను ప్రారంభించారు. కాగా సుమారు 800 కిలోల బరువున్న బండను ఎడ్లతో లాగే ఈ పోటీల్లో వివిధ గ్రామాల నుంచి 20 ఎడ్ల జతలు వచ్చాయి. రైతులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. గతంలో ఎప్పుడూ ఈ ప్రాంతంలో జరగని పోటీలు కావడంతో గజరాయునివలసకు వేలాదిగా జనం తరలివచ్చారు.

భోగి వేడుకలో జీఎంఆర్

గతేడాది భోగి వేడుకలకు దూరంగా ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లిఖార్జునరావు (జీఎంఆర్) ఈ ఏడాది రాజాంలోని కంచరవీధిలో నిర్వహించే భోగి వేడుకలో పాల్గొన్నారు. సంక్రాంతి రోజున వేలాది మంది పేదలకు ఇచ్చే అన్న, వస్త్రదానంలో సోమవారం జీఎంఆర్ పాల్గొంటారు.



బొబ్బిలి: తారకరామ కాలనీలో భోగి పిడకలతో చిన్నారులు



రామతీర్థంలో గోదాదేవి కల్యాణం

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి దేవస్థానం వద్ద భోగి పండగను పురస్కరించుకుని ఆదివారం గోదాదేవి కల్యాణోత్సవాన్ని దేవస్థానం అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రాతః కాలార్చన, తిరుప్పావై సేవా కాలం, బాలభోగం నిర్వహించారు. అనంతరం గోదాదేవిని గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేసి దేవాలయం పక్కనే ఉన్న పుష్కరిణిలో స్నానం చేయించి ఆలయంలోకి తీసుకువచ్చారు. గోదాదేవి అమ్మవారిని పెళ్లికుమార్తెగా అలంకరించి శ్రీకృష్ణునితో కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీఎస్‌ఎన్ కిషోర్‌కుమార్ పర్యవేక్షించారు.

నిర్వహణ లేక.. నిప్పంటించి

- చెత్త కుప్పలకు మంట పెడుతున్న వైనం
- ఇదీ బొబ్బిలి మునిసిపాలిటీలో పరిస్థితి


చెత్త కుప్పలకు మంట పెట్టిన దృశ్యం

బొబ్బిలి: బొబ్బిలి మునిసిపాలిటీలోని డంపింగ్ యార్డులో చెత్త నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందన్న విమర్శలొస్తున్నాయి. చెత్తతో సంపద సృష్టించవచ్చని ప్రభుత్వ సూచన ఇక్కడ అమలుకు నోచుకోవడం లేదు. ఒకప్పుడు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును బొబ్బిలి మునిసిపాలిటీ సొంతం చేసుకున్న విషయం విదితమే. ప్రస్తుతం సిబ్బంది నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేక వీధుల్లో సేకరిస్తున్న చెత్తకుప్పలకు నిప్పంటిస్తుండడం విశేషం. పట్టణంలోని వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయం సమీపంలో గల కృష్ణాపురం రహదారిలో ఉన్న పాత డంపింగ్‌యార్డులో ప్రతిరోజూ చెత్తకు మంటలు పెడుతున్నారు. దీంతో పొగ, వాసనతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ డంపింగ్ యార్డును పూర్తిగా మూసివేసి పర్యావరణపరంగా ఆ స్థలాన్ని వినియోగించుకోవాలని పలు సంఘాల ప్రతినిధులు అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన విషయం విదితమే. చెత్తకు మంట పెట్టకూడదన్న నిబంధన సైతం ఉల్లంఘించి తగలబెట్టడం సరైన పద్ధతికాదని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించాల్సిందిపోయి, ఇలా తగలబెట్టడం ఎంతవరకు సమంజసమని పలువురు పట్టణవాసులు ప్రశిస్తున్నారు. కాగా శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరుకు చెత్తకు మంటలు పెట్టవద్దని ఆదేశించామని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

రోడ్డు మధ్యలోనే.. మూడు నెలలుగా

- బొబ్బిలి చర్చి సెంటర్‌లో మట్టిదిబ్బలు ● ప్రయాణికులు, పాదచారులు అవస్థలు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని చర్చి సెంటర్‌లో గల ప్రధాన రహదారి మధ్యలో మూడునెలలుగా మట్టిదిబ్బలు తొలగించకపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు, పాదచారులు అవస్థలకు గురవుతున్నారు. సంక్రాంతి పురస్కరించుకుని కొద్దిరోజులుగా పట్టణానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సరుకులు, దుస్తులు కొనుగోలుకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. చర్చి సెంటర్ మీదుగా ఎక్కువగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఇక్కడ మట్టి దిబ్బలు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు. కోర్టుసెంటర్ నుంచి పోలీసు స్టేషన్, ప్రభుత్వాస్పత్రి, కోవల సెంటర్ మీదుగా అమ్మిగారి కోనేరుగట్టు వరకు గల బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు ముదు నెలల కిందట జరిగిన విషయం విదితమే. అప్పట్లో ఆర్‌అండ్‌బీ, మునిసిపల్ అధికారులు రోడ్డు మధ్యలో మట్టి పోగులు వేశారు. ఆ తర్వాత చర్చి సెంటర్‌లో వేసిన మట్టి తొలగించకపోవడంతో చీకటిపడిన తర్వాత వచ్చే వాహనాలు బోల్తాపడుతున్నాయని పలువురు వాపోతున్నారు.కాగా చర్చి సెంటర్‌లో మట్టిదిబ్బలను తొలగించాలని కాంట్రాక్టరుకు తెలియజేసినట్లు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆంధ్రజ్యోతికి తెలిపారు.


బొబ్బిలి చర్చి సెంటర్‌లో రోడ్డు మధ్యలో మట్టిదిబ్బలు

గొల్లపల్లిలో ధాన్యం కాలిబూడిద


కృష్ణకు ఆర్థికసాయం అందజేస్తున్న బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలిలోని గొల్లపల్లికి చెందిన బొబ్బాది కృష్ణకు చెందిన ధాన్యానికి ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి తగలబెట్టారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పొలంలో పండిన పంటను నూర్చి బస్తాల్లో నిల్వచేశాడు. ఇంతలో కుప్పలకు దుండగులు వరిగడ్డి వేసి మంట పెట్టడంతో ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. వంద బస్తాలు నిల్వచేయగా 40 బస్తాలకుపైగా ధాన్యం పూర్తిగా కాలిబూడిదయ్యాయని అధికారులు చెబుతున్నారు. వ్యక్తిగత కక్షలతోనే ఈ దురాగతానికి పాల్పడినట్లు బాధితుడు అనుమానిస్తున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దుర్బుద్ధితో ఎవరో తగలబెట్టారని రైతు కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఈసమాచారం తెలియగానే మునిసిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, తహశీల్దార్ డోల రాజేశ్వరరావు, వీఆర్వో సింహాచలం, ఆర్బీకే ప్రతినిధి పుణ్యవతి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పాడైన ధాన్యాన్ని సమీపంలో గల రైసుమిల్లుకు తరలించారు. ఈ అంశాన్ని సివిల్ సప్లయిస్ డీఎం దృష్టికి తీసుకెళ్లామని వ్యవసాయశాఖ ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. ధాన్యం మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నా పండుగకావడంతో రవాణాకు సంబంధించిన షెడ్యూల్‌ను రైతు తీసుకోలేదని, పండుగ తర్వాత తరలిద్దామనుకున్నారని, ఇంతలోనే ఈ దారుణం జరిగిందని కృష్ణ వాపోయాడు. కాగా గొల్లపల్లిలో ధాన్యం కాలిపోయిన రైతు కృష్ణను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన ఆదివారం పరామర్శించి ఓదార్చారు. నష్టపోయిన రైతుకు తనవంతుగా ఆర్థికసహాయం చేశారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా కృషిచేస్తానని ఆయన హామీఇచ్చారు. బేబీనాయన వెంట గొల్లపల్లి టీడీపీ నాయకులు పిరిడి ఈశ్వరరావు, కాకల వెంకటరావు, తవిటినాయుడు ఉన్నారు.

నచ్చింది లేదు... ఇచ్చిందే తాగండి

- పండుగ పూట కానరాని పాత బ్రాండ్లు ● మద్యం ప్రియుల ఆందోళన

గజపతినగరం: జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం ప్రియులకు నచ్చిన బ్రాండ్ దొరకడంలేదు. నిర్వాహకులు ఇచ్చిన మద్యం బ్రాండ్లతో సరిపెట్టుకోవల్సివస్తోంది. పండుగ కూడా పాత బ్రాండ్ల మద్యం దొరకడం లేదని, బ్రాండ్ల ముసుగులో చీప్ లిక్కర్ విక్రయిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

మద్యం షాపుల్లో పాత బ్రాండ్లు విక్రయించనున్నట్లు ప్రభుత్వం ఇటీవల పేర్కొన్నా ఎక్కడా కానరావంలేదని మద్యం ప్రియులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణపై వారంతా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గతంలో విక్రయించిన రెగ్యులర్ బ్రాండ్లు ప్రస్తుతం ఎక్కడా దొరకడంలేదని వాపోతున్నారు.ఇప్పటివరకు తాగని, ఎన్నడూచూడని మద్యం బ్రాండ్లు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్నారని, నచ్చిన మందులేదని, ఇచ్చిందే తాగాలని కొందరు నిర్వాహకులు సూచిస్తున్నారు. రోజంతా కూలి పనులు చేసుకొని వచ్చేవారు గతంలో అలవాటైన బ్రాండ్‌పై మొగ్గుచూపుతున్నారు.ఈనేపథ్యంలో తాము ఇచ్చిన మద్యాన్ని తీసుకోవాలని పేర్కొనడంతో తాగాల్సిన దుస్థితి నెలకొందని, దీంతో అనారోగ్యానికి గురవుతున్నామని వాపోతున్నారు. బ్రాందీ, బీరు, విస్కీ, రమ్ము, వైన్ బార్లు, రెస్టారెంట్లల్లో మాత్రమే లభ్యమవుతున్నాయి. ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన సరుకు మాత్రమే విక్రయించగలమని, మీరుకోరిన బ్రాండ్లను సరఫరా చేయలేమని షాపుల నిర్వాహకులు చెబుతున్నారు.బార్లకువెళ్లి తాగుదామంటే బాటిల్‌పై అదనంగా డబ్బులు చెల్లించుకోవల్సివస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దీంతో మద్యం ప్రియులు ఏదో ఒక బ్రాండ్‌తో సరిపెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత బ్రాండ్ విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మందు బాబులు కోరుతున్నారు.

రేపు శ్రీకృష్ణారాయుడుస్వామి తీర్థమహోత్సవం

వేపాడ:మండలంలోని కృష్ణరాయుడుపేటలో కనుమ పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి శ్రీకృష్ణారాయుడుస్వామి తీర్థ మహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు,తీర్థమహోత్సవ నిర్వాహకకమిటీ సభ్యులు ఒకప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగాఉదయం ఐదుగంటల నుంచి గ్రామస్థులు దూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అఖండ దీపారాధన, అభిషేకాలు ప్రత్యేక పూజలతో పాటు స్వామివారికి మొక్కులు తీర్చుకుంటారని పేర్కొన్నారు. సాయంత్రం రెండుగంటల నుంచి ఎడ్ల పరుగుపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జామిలో ట్రాఫిక్ కష్టాలు


జామి ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

జామి:జామిలోని జామి-విజయనగరం ప్రధాన రహదారిలో ఆదివారం ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రధానంగా కూరగాయాల వ్యాపారులు తమ వ్యాపారం కోసం ప్రధాన రహదారిని ఆక్రమించడంతో పాటు చాలామంది రోడ్డుపైన తమ వాహనాలు పార్కింగ్‌చేసి వెళ్లిపోయారు. దీంతో తర్వాత వచ్చిన వాహనాలు ముందుకు వెళ్లడానికి వీల్లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో పండుగకు గ్రామాలకు బయలదేరిన వారు, వాహనచోదకులు అవస్థలకు గురయ్యారు.

అప్పలనర్సమ్మకు బేబీనాయన పరామర్శ

బాడంగి: స్థానిక ఎంపీటీసీ మాజీ సభ్యురాలు గుణుపూరు అప్పలనర్సమ్మను బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన ఆదివారం పరామర్శించారు. అప్పలనర్సమ్మ శనివారం ఇంటి వద్ద పడిపోవడంతో కాలు విరిగిపోయింది. దీంతో బేబీనాయన టీడీపీ నాయకుడు గుణుపూరు స్వామినాయుడు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తెంటు రవిబాబు, మాజీ కౌన్సిలర్ ఏగిరెడ్డి శ్రీధర్, గుణుపూరు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

- రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళి

రాజాం: సీఎం జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందని రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. ఆదివారం రాజాంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీని పూర్తిగా ప్రజలు తరమికొట్టేరోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. చంద్రబాబునాయుడును అక్రమంగా ఇరికించి 53 రోజులు జైలులో పెట్టించారని, కోర్టుకు ఎటువంటి ఆధారాలు సమర్పించలేకపోయారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, కిమిడి అశోక్‌కుమార్, మరిపి జగన్మోహన్‌రావు, టంకాల నాగరాజు, పిన్నింటి మోహన్‌రావు పాల్గొన్నారు.● ఆగూరులో మూడువేల మందికి దుప్పట్లు, చీరలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

టీడీపీలో చిన్నయ్యపేటవాసుల చేరిక



రేగిడి: చిన్నయ్యపేట యువతను ఆహ్వానిస్తున్న కోండ్రు మురళి

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీ చిన్నయ్యపేటలోని వైసీపీకి చెందిన యువకులు టీడీపీలో చేరారు. రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహనరావు ఆధ్వర్యంలో ఆదివారం శ్యాంపురంలో క్యాంపు కార్యాలయంలో వైసీపీ యుత్ ప్రెసిడెంట్ బోర చంద్రశేఖర్ తదితరులు చేరినట్లు రేగిడి మండల టీడీపీ పార్టీ నేతలు దూబ ధర్మారావు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు మండల యువత అధ్యక్షుడు మజ్జి శ్రీనవాసరావు, కె.అశోక్‌కుమార్, కర్రి రమణ, గంగు కృష్ణారావు, గురువాన ధనంజయ్‌రావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు


ముంజేరు సమీపంలో ఉన్న ఓ మలుపు

భోగాపురం:భోగాపురం నుంచి ముక్కాం, అమటాం రాయవలస నుంచి చేపలకంచేరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారుల్లో మలుపులుప్రమాదకరంగా ఉన్నాయి. భోగాపురంనుంచి ముక్కాం వెళ్ల రహదారిలో సరివలస, ముంజేరు, సచివాలయం, రామచంద్రపేటజంక్షన్, అమటాం రాయవలస నుంచి కంచేరు ఆర్‌అండ్‌బీ రహదారిలో అమటాంరాయవలస, గూడెపువలస, బైరెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల్లో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలమైన ప్లాట్‌ఫారాలు


కొండ్రాజుపాలెంలో శిథిలమైన ప్లాట్‌ఫారం

భోగాపురం: తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉండేలా నిర్మించిన చేపలు ఆరవేసుకొనే ప్లాట్‌ఫారాలు శిథిలమై నిరుపయోగంగా మారాయి. ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు తదితర గ్రామాల్లో ప్రభుత్వం రూ.43 లక్షలతో 43 ప్లాట్‌ఫారాలు నిర్మించింది. చిన్న చేపలు, కవ్వలు, నెత్తలు, తదితర చేపలను ఆరవేసుకోవడానికి ప్లాట్‌ఫారాలు ఉపయోగకరంగా ఉంటాయని మత్స్యకారులు సంతోషించారు. వారి సంతోషం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ప్లాట్‌ఫారాలు నిర్మించిన కొద్దికాలానికే శిథిలమయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కొత్త ప్లాట్‌ఫారాలు నిర్మించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు


ముక్కాం సముద్రతీరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

భోగాపురం: ముక్కాం సముద్ర తీరం ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. తీరం వెంబడి సముద్రం అంతా ప్లాస్టిక్, చెత్తా, చెదారంతో దర్శనమిస్తోంది. గ్రామంలో ఉండే చెత్త సముద్రంలోకి కొట్టుకురావడం, తీరంలో పడేయడంతో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. పంచాయతీ వారు స్పందించి తీరం వెంబడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

బట్టికాలువలో దోమల స్వైరవిహారం


గుర్రపుడెక్కతో నిండిన బట్టికాలువ

భోగాపురం: భోగాపురం బట్టి కాలువ వ్యాధులకు నిలయంగా మారింది. ఈ కాలువ బొల్లి వీధి సమీప పాఠశాల నుంచి గంగిరావి చెరువు వరకు సుమారు 12 మీటర్ల వెడల్పుతో కిలోమీటరకుపైగా పొడవు ఉంది. ఇక్కడ దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో అనేక మంది అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఫైలేరియాతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. దీనిలో ఇటీవల కొంతవరకు పూడికతీశారు. అధిక భాగం ఇంకా పూడికతోఉంది. దీంతో దోమలు వృద్ధి చెందుతు న్నాయి. అధికారులు స్పందించి బట్టికాలువ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పారమ్మ పేరంటాలకు పూజలు


పాపమ్మతల్లి సారె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: మండలంలోని నిడుగట్టులో గల పాపమ్మ పేరంటాలకు పాటూరు గ్రామస్థులు పసుపుకుంకుమలతో పాటు సారె, చీర సమర్పించారు. ఆదివారం ఉదయం గ్రామస్థులు పాటూరు రమణమూర్తి ఆధ్వర్యంలో నిడుగట్టు గ్రామానికి సుమారు 35 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. ఎల్.కోట జంక్షన్ వద్ద మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అమ్మవారి సారెను నెత్తిన పెట్టుకొని మోశారు. నిడుగట్టులో అమ్మవారికి పూజలు నిర్వహించి పండగ చేశారు. సుమారు రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రెండేళ్లకు ఒకసారి భోగి రోజున పాపమ్మతల్లికి పసుపుకుంకుమలు సమర్పిస్తామని పాటూరు గ్రామస్థులు తెలిపారు.

అభ్యర్థులను మారిస్తే అధికారం రాదు

- టీడీపీ విశాఖ పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు అప్పారావు

కొత్తవలస : అభ్యర్థులను మారిస్తే అధికారం రాదని, ప్రజలు ఆదరిస్తే అధికారం వస్తుందని టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, అధికార ప్రతినిధి కోళ్ల వెంకట రమణ తెలిపారు. ఆది వారం కొత్తవలసలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ నియోజకవర్గాల ఎమ్మెల్యేలను మారిస్తే ఓట్లు రాలవని, చెల్లని రూపాయి ఎక్కడైన చెల్లదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిచేస్తే ప్రజలు ఆదరిస్తారని, అభివృద్ధి లేని వారిని ఎలా ఆదరిస్తారని ప్రశ్నించారు. కనీసం రోడ్లు వేయించలేకపోయారని, ఐదేళ్లపాటు కక్షలు, కబ్జాలతో కాలయాపన చేసిన ముఖ్యమంత్రి తనను చూసి ఓటేయాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తనను చూసి ఓటేయడానికి ముఖ్యమంత్రి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని వేయాలా, సమస్య పరిష్కారం కోసం ఆందోళన చేసిన వారిపై కేసులు పెట్టినందుకు ఓటేయాలా, ప్రభుత్వ ఉద్యోగులు దాచుకున్న సొమ్మును వాడుకున్నందుకు ఓటేయాలా, కనీసం ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేనందుకు ఓటేయాలా అని ప్రశ్నించారు.మద్య నిషేధం చేయకపోతే ఓటే అడగనని చెప్పిన ముఖ్యమంత్రి మళ్లీ ఇప్పుడు ఎలా ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతారన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలను కనీసం తన దరిదాపులకు రానీయకపోతే నియోజకవర్గ సమస్యలను ఎలా చెప్పుకుంటారన్నారు. ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోవడంతో కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, ముఖ్యమంత్రి మాటలను విశ్వసించే స్థితిలో లేరని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎటువంటి తీర్పు వచ్చిందో అదే రకమైన తీర్పును ప్రజలు ఇవ్వ బోతున్నారని తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

భోగాపురం: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి అక్రమంగా తరలిస్తున్న 57 మద్యంసీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేశామని ఎస్‌ఐ సూర్యకుమారిఆదివారం తెలిపారు. కొండ్రాజుపాలెంజంక్షన్ సమీపంలో కొండ్రాజుపాలెంకు చెందిన మూగి రాము నుంచి 42, దిబ్బలపాలెంకు చెందిన పిట్టా అప్పన్న నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

పెరుమాళిలో 'మన ఊరు-మన ఆట'


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనసేన నాయకులు

తెర్లాం: మండలంలోని పెరుమాళి జనసేన నాయకులు రేగాన శంబర పోలయ్య, శ్రీనుల ఆధ్వర్యంలో తెర్లాం మండల జనసేన అధ్యక్షులు మరడాన రవి ఆదివారం మన ఊరు-మన ఆట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జనసేన రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బాబు పాలూరు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ పొత్తును ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలిచిన, పాల్గొన్నవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొబ్బిలి మండల అధ్యక్షులు సంచాన గంగాధర్, టీడీపీ సర్పంచ్ అప్పచ్చు రాజు, వీర మహిళ యందవ యామిని, చందక ఉమామహేష్, ఆర్‌పీ.రాజు, రేగాన సింబు పాల్గొన్నారు.

అడుగడుగునా గోతులమయం

- జాతీయరహదారిపై భారీ వాహనాలతో మెటీరియల్ తరలింపు
- దెబ్బతిన్న బుడతనాపల్లి, చంద్రంపేట, సిరిపురం రోడ్లు
- వాహనచోదకులకు తప్పని అగచాట్లు

గంట్యాడ: కొటారుబిల్లి కూడలి నుంచి బుడతనాపల్లి వరకూ వెళ్లే సుమారు ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అడుగడుగునా గోతులమయంకావడంతో వాహనచోదకులకు అగచాట్లు తప్పడంలేదు. విశాఖ- రాయపూర్ వరకూ నిర్మిస్తున్న జాతీయరహదారికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద పెద్ద వాహనాలతో మెటీరియల్ తరలించడం వల్ల రహదారులు పూర్తిగా పాడయ్యాయి. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి బుడతనాపల్లి పరిధిలో నుంచి గ్రావెల్, పెణసాం పరిధిలో నుంచి మెటల్ పెద్ద పెద్ద లారీలతో తరలిస్తున్నారు. కొటారుబిల్లి కూడలి నుంచి బుడతనాపల్లి మీదుగా గొడియాడ, కిర్తుబర్తి, పెణసాం, చినమానాపురం, బుడతనాపల్లి, రాజేరు తదితర గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రామవరం నుంచి చికలగెడ్డ వరకూ విస్తరించిన రహదారికి చంద్రంపేట, సిరిపురం, కొటారుబిల్లి, గంట్యాడ చెరువుల్లో నుంచి మట్టిని తరలించారు. పెద్ద పెద్ద లారీలతో తరలించడంతో చంద్రంపేట, సిరిపురం గ్రామాల రహదారి కూడా దెబ్బతింది. గోతులు ఉన్న చోట ఆటో డ్రైవర్లు మట్టిని వేసి కప్పుకున్నారు.


గోతులమయమైన సిరిపురం నుంచి చంద్రంపేట వెళ్లే రోడ్డు

గోదారంగ నాయకుల కల్యాణం


బొబ్బిలి: కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

బొబ్బిలి: బొబ్బిలి కంచరవీధి కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా ఆదివారం గోదారంగనాయకుల కల్యాణమహోత్సవాన్ని అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింగారపువీధి వైభవవేంకటేశ్వరా లయంలో కూడా కల్యాణ మహోత్సవం జరిగింది. హరిదాసు పాటలు, చిన్నపిల్లలకు భోగిపళ్ల స్నానం చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవ ముగింపు కార్య క్రమాలను నిర్వహించారు.

●**రామభద్రపురం:**మండలంలోని ఆరికతోటలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి పురస్కరించుకొని గోదాదేవి కల్యాణం నిర్వహించారు. పూజారి బాదంపూడి నాగ రామలింగేశ్వరశర్మఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు. సంక్రాంతి ముందు నెల రోజులు గ్రామంలో మేలుకొలుపు,ఆ తర్వాత భోగిరోజు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో అవినాష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంఘాల సందడి

కొత్తవలస:మండలంలోని పలు గ్రామాల్లో ఏటా సంక్రాంతికి సందడి ప్రారంభమవుతుంది. గ్రామాల్లో వివిధ సామాజికవర్గాల వారీగా సంఘాలను ఏర్పాటుచేసుకుని కొంత సొమ్మును పొదుపు చేసుకుంటారు. ఆ సొమ్మును సంఘ సభ్యులు తమ అవసరాల కోసం మళ్లి స్వల్ప వడ్డీతో రుణాలు తీసుకుంటారు. ప్రతి సంఘంలో కనీసం 50 నుంచి 60 మంది వరకు సభ్యులుగా ఉంటారు. వీరంతా ఒకేసారి రూ.వేయి నుంచి 10 వేలు వరకు కూడుకుంటారు. ఇలా వచ్చిన సొమ్మును వారి సంఘంలో ఉన్న డబ్బు బట్టి స్వల్ప వడ్డీపై రుణం తీసుకుంటారు. ఇలా తీసుకున్న రుణం, వడ్డీ ప్రతి సంవత్సరం భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో జమ చేస్తారు. ఇలా జమచేసిన సొమ్మంతా మళ్లీ సంఘానికి చేరిన వెంటనే తమ అవసరాల కోసం తీసుకుంటారు. మండలంలోని ప్రతి గ్రామంలో పండగ మూడు రోజులు పొదుపుపై చర్చ పండగ వాతావరణంలా జరుగుతుంది. ఎవరైనా సంఘానికి డబ్బులు అనుకున్న సమయానికి వడ్డీతో సహా చెల్లించకపోతే అటువంటి వారిని అనర్హులుగా గుర్తిస్తారు. దీంతో ప్రతిసభ్యుడు తీసుకున్న సొమ్మును తప్పనసరిగా తిరిగి చెల్లిస్తుంటారు.

అయోధ్య అక్షింతల పంపిణీ


అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రామభద్రపురం:మండలంలోని ఆరికతోటలో ఆదివారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులు పంపిణీ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు తాడుతూరు వెంకటరావు ఆధ్వర్యంలో మహిళలు ఇంటింటికి వెళ్లి అక్షింతలు, శ్రీరాములవారి పట్టాభిషేక ఫోటోలను పంపిణీ చేశారు.

ముగ్గుల పోటీ విజేత అనూష

శృంగవరపుకోట: టీడీపీ రాష్ట్రకార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీల్లో లక్కవరపుకో మండలానికి చెందిన ఇమంది అనూష (లక్కవరపుకోట)విజేతగా నిలిచి రూ.20వేలు నగదు బహుమతి సాధించింది.వేపాడ మండలానికి చెందిన చలుమూరి చిట్టితల్లి, జామి మండలానికి చెందిన కటకం జితేంద్రకల్యాణి, కొత్తవలసకు చెందిన కర్రి కల్యాణి, వేపాడకు చెందిన కర్రి గోవర్ధిని వరుస బహుమతులు సాధించారు. ఈ మేరకు రెండు నుంచి ఐదుస్థానాలు సాధించి నగదుబహుమతులు అందుకున్నారు. వీరికి టీడీపీ రాష్ట్రకార్యదర్శి గొంప కృష్ణ భార్య రమాదేవి నగదు బహుమతులు అందజేశారు. అలాగే నియోజకవర్గ స్థాయి క్రికెట్‌పోటీల్లో యశ్వంత్-11 ప్రథమ, సింగపూర్ జట్లు ద్వితీయస్థానాల్లో నిలిచాయి. వీరికి ప్రథమ బహుమతికింద రూ.50వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.35వేలు నగదుబహుమతులను గొంప కృష్ణ అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ,మండలస్థాయి టీడీపీ నేతలు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటల విజేతలకు బహుమతులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

పల్లెల్లో పండగ సందడి

● బంధు మిత్రులతో కళకళలాడుతున్న గ్రామాలు
● వైభవంగా భోగి

పల్లెల్లో పండగ సందడి నెలకొంది. దూర ప్రాంతాల్లో ఉన్నవారంతా స్వగ్రామాలకు వచ్చి చేరారు. సంక్రాంతి మూడు రోజుల్లో మొదటి రోజైన భోగి పండగను జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో వేకువజామున పెద్దఎత్తున భోగి మంటలు వేశారు. పిల్లలు, పెద్దలు.. వాటిలో భోగి పిడకలు, వంటచెరకు వేసి, నమస్కరించారు. తలంటు స్నానం చేసి, నూతన వస్త్రాలు ధరించారు. కుటుంబ సభ్యులతో, బంధువులతో ఆనందంగా గడిపారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


నెల్లిమర్ల: రామతీర్థంలో భోగి మంటలు వేసిన దృశ్యం


చీపురుపల్లి: రామాంజనేయ కాలనీలో..


రేగిడి: సంకిలిలో..


ఎస్.కోట రూరల్: జామిలో


బొబ్బిలి: పట్టణంలోని నాయుడుకాలనీలో


వేపాడ: తొడపెద్దును ఊరేగిస్తున్న గ్రామస్థులు


గరుగుబిల్లి: రావివలసలో భోగి మంటలు వేస్తున్న గ్రామస్థులు


డెంకాడలో..

రాష్ట్రానికి పట్టిన కీడు తొలగాలి

● ప్రజా వ్యతిరేక జీవోలను భోగి మంటల్లో దహనం చేసిన టీడీపీ నాయకులు
● వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలని పిలుపు

వైసీపీ రూపంలో రాష్ట్రానికి పట్టిన కీడు తొలగిపోవాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు భోగి సంకల్పం పేరుతో ఆదివారం భోగి మంటల్లో వివిధ ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను దహనం చేశారు. వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు.

చీకటి జీవోలు తీసుకురావడం దారుణం

భోగాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ లేనివిధంగా ప్రజా వ్యతిరేకమైన జీవోను తీసుకురావడం దారుణమైన చర్య అని టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. ఈ మేరకు ఆయన ప్రజా వ్యతిరేక జీవో కాపీలను పోలిపల్లి గ్రామంలో ఆదివారం భోగి మంటల్లో దహనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, కర్రోతు రాజు, దాసరి అప్పలస్వామి, చింతపల్లి రామకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.


భోగాపురం: జీవో కాపీలను భోగి మంటల్లో వేస్తున్న బంగార్రాజు


రాజాం: భోగి మంటలో జాబ్ క్యాలెండర్ ప్రతులను తగలబెడుతున్న కోండ్రు మురళీమోహన్

పండగతో కీడు పోవాలి

గంట్యాడ: సీఎం జగన్ వల్ల ఏపీ ప్రజలకు పట్టిన కీడు ఈ సంక్రాంతి పండగతో తొలగిపోవాలని మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు అన్నారు. ప్రజలు హక్కులను కాలరాసిన జీవో కాపీలను ఆదివారం గంట్యాడలో ఆయన భోగి మంటల్లో వేసి, దహనం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, పార్టీ నాయకులు అల్లు విజయకుమార్, రంధి చినరామునాయుడు, పి.సత్యనారాయణ, పల్లి వెంకటరావు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ ఏదీ?

రాజాం: శ్యాంపురం క్యాంపు కార్యాలయం ఆవరణలో భోగి పురస్కరించుకుని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ భోగి మంటవేశారు. ఈ సందర్భంగా జాబ్ క్యాలెండర్ ప్రతులను తగలబెట్టారు. సీఎం జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏడాది జాబ్‌క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామనని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లు పూర్తయినా ఇంతవరకు ఒక్క జాబ్‌క్యాలెండర్ విడుదల చేయలేదని ఆరోపించారు.

అరాచక పాలన పోవాలి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్రంలో అరాచక పాలన పోయి, ప్రజాపాలన రావాలని జనసేన నాయకులు గురాన అయ్యలు కోరారు. ఆదివారం విజయనగరం మంగళ వీధిలో ప్రజావ్యతిరేక జీవోలను రద్దు చేయాలని కోరుతూ జీవో కాపీలను భోగి మంటల్లో వేశారు. ఈసందర్భంగా అయ్యలు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి విధ్వంసకర పాలన కొనసాగిస్తూ, సైకో ఆనందం పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నవీన్‌కుమార్, రాజేష్, వెంకటేష్‌నాయుడు, భార్గవ్, పవన్‌కుమార్, సురేష్, అప్పలనాయుడు పాల్గొన్నారు.


గంట్యాడలో..,


విజయనగరం: జీవో కాపీలను మంటల్లో వేస్తున్న జనసేన నాయకుడు గురాన అయ్యలు

'రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమే'

చీపురుపల్లి: రాష్ట్రంలో రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న అశోక్ గజపతిరాజు జిల్లాలో రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని టిక్కెట్ల విషయంలో నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గానికి అదితిగజపతి అభ్యర్థిత్వం సరైనదేనన్నారు. పార్లమెంటు అభ్యర్థిగా అశోక్‌గజపతిరాజు రంగంలోకి దిగితే పార్టీ గెలుపు నల్లేరుపై నడకలా సాగుతుందన్నారు. టీడీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గంట్యాడ: అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నరవ గ్రామంలో ఆ గ్రామస్థులు ర్యాలీ నిర్వహించారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించాలంటూ నినాదాలు చేశారు. ప్రతి ఇంటిపై కాషాయం జెండాలను ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ ఏనుగులు త్రినాథ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనం ప్రారంభం

నెల్లిమర్ల: తంగుడుబిల్లి గ్రామంలో శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఆదివారం రాత్రి ప్రారంభించారు. తన వంతుగా రూ.30వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, పూసపాటిరేగ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, కార్యదర్శి లెంక అప్పలనాయుడు, పిన్నింటి సన్యాసినాయుడు, నాయకులు పోతల రాజప్పన్న, చందక చిన్నంనాయుడు పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న బంగార్రాజు

వస్త్రాల పంపిణీ

రాజాం రూరల్: మండలంలోని ఒమ్మి సమీపంలోని ఏపీ జగన్నాథరావు పట్నాయక్ మందిరం వద్ద ఆదివారం భోగి, సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు జరిపించారు. మూడు వేల మందికి అన్న, వస్త్రదానం చేశారు. జేఎల్‌కే టైల్స్ అధినేత ఏపీ కృష్ణార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబసభ్యులు రమణమ్మ, ఆగూరు లీలాకుమారి, ప్రియాంక, డాక్టర్ ఆమిటి అన్వేష్, డాక్టర్ స్వాతి వాసంతి, రాజా, ఉమా పాల్గొన్నారు.


వస్త్రదానం చేస్తున్న జేఎల్‌కే టైల్స్ అధినేత ఏపీ కృష్ణార్జున, కుటుంబ సభ్యులు

రెల్లివలసలో..

విజయనగరం: జిల్లాలోని పూసపాటిరేగ మండలం రెల్లివలస గ్రామంలో సంక్రాంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వెంపడాపు రమేష్ నాయుడు, సూర్యనారాయణ, ఇజ్జురౌతు ఈశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ ఇజ్జురౌతు అప్పలరాజు రూ.8 లక్షలు విలువ చేసే వస్త్రాలను పంపిణీ చేశారు. మూడు వేల మంది మహిళలకు చీరలు, 1500మంది పురుషులకు లుంగీలు పంచిపెట్టారు.


వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఇజ్జురౌతు

● **చీపురుపల్లి:** టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముల్లు రమణ ఆదివారం చీపురుపల్లిలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. దుర్గా మల్లేశ్వర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బుడతనాపల్లిలో నిత్యావసర సరుకులు

గంట్యాడ: బుడతనాపల్లి గ్రామంలోని జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం 40 మంది నిరుపేదలకు ఏడు రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మాజీ మంత్రి పడాల అరుణ, జనసేన ఉత్తరాంధ్ర రిజనల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మి చేతులమీదుగా సరుకులు అందజేశారు. జనసేన పార్టీ నాయకులు ఎస్.అప్పలరాజు, ఎం.జగన్, రాంబాబు, ఎర్నినాయుడు, పల్లా రాము పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక జీవో కాపీల దహనం

బొబ్బిలి: మల్లపేట గ్రామంలో పలువురు యూటీఎఫ్ నాయకులు ఆదివారం భోగి పండగ సందర్భంగా వేసిన మంటలో ప్రజా వ్యతిరేక జీవో కాపీలను దహనం చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


జీవో ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

భోగి మంటల్లో ఎస్మా జీవో ప్రతులు

అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 34వ రోజుకు చేరుకుంది. అయితే ఆదివారం భోగి పండగ సందర్భంగా వేసిన భోగి మంటల్లో ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



కొత్తవలస: భోగి మంటలో జీవో కాపీలు వేస్తున్న అంగన్‌వాడీలు, రాజాం రూరల్‌లో..

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

డెంకాడ: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వద్ద ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని, ఆనందంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు.



ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మంచు దుప్పటి

భోగాపురం: ఎన్నడూ లేని విధంగా భోగాపురాన్ని గత మూడు రోజులుగా మంచు దుప్పటి కప్పేస్తుంది. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి 7.30 గంటల వరకు మంచు అధికంగా కురిసింది. వాహన చోదకులతో పాటు బాటసారులు ఇబ్బందులు పడ్డారు.


భోగాపురంలో పొగమంచు కురుస్తున్న దృశ్యం